క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు



వాజేడు : మండల కేంద్రంలోని నాగారం గ్రామంలో పంచాయతీ సిబ్బంది సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టి డ్రైయినేజీలు శుభ్రం చేశారు. డ్రైయినేజీల్లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని శుభ్రం చేసి, ముళ్లపొదలను తొలగించారు.

నేడు చెక్కుల పంపిణీ

టేకుమట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు నేడు (మంగళవారం) చిట్యాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక నాయకులు లబ్ధిదారులను చిట్యాల మండల కేంద్రానికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

బస్సు సర్వీస్‌ను పునఃప్రారంభించాలి



టేకుమట్ల: మండల కేంద్రం నుంచి అంకుషాపూర్, సుబ్బక్కపల్లి, మొగుళ్లపల్లి మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునఃప్రారంభించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు అధికారులను కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో మండల కేంద్రం నుంచి అంకుషాపూర్, సుబ్బక్కపల్లి, మొగుళ్లపల్లి మీదుగా పరకాలకు బస్సు సర్వీస్ ఉండేదని వివరించారు. కానీ రోడ్డు సరిగా లేకపోవడంతో అర్థాంతరంగా బస్సు సర్వీస్ నిలిపి వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నూతనంగా రోడ్డు నిర్మాణం సైతం చేపట్టారని ఎమ్మెల్యే సత్యనారాయణరావు, ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి బస్సు సర్వీస్‌ను పునఃప్రారంభించాలని కోరారు. ఆయన వెంట నాయకులు మహేందర్, స్వామి, వెంకటేష్, రమేశ్, హరీష్, రాజయ్య తదితరులు ఉన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటాలకు కాంగ్రెస్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు ఆధ్వర్యంలో సోమవారం పాలాభిషేకం చేశారు. మండలంలోని దళిత వాడల్లో రోడ్లకు నిధులు, అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసి ఉద్యోగులను కూడా కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మాజీ ఎంపీపీ రాణిబాయి, మాజీ జెడ్పీటీసీ గుడాల అరుణ, బ్లాక్ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు అస్రర్, యూత్ టౌన్ అధ్యక్షుడు నయీం, దేవస్థాన మాజీ చైర్మన్ వామన్‌రావు పాల్గొన్నారు.

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ

కాళేశ్వరం: జిల్లా కేంద్రంలో ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కుడుదుల వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యాలయంలో కార్మికులతో కలిసి మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి 1996లో భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండారి లావణ్య, లక్ష్మీరాజ్యం, గోనె రవి, రాముడు సదానందం, కామెడీ మల్లన్న, కాగిత పద్మ, కార్మికులు బల్ల శ్రావణ్, పోతుల సదయ్య ఉన్నారు.

నీళ్లు లేవు.. తాళాలు తీయరు!



నాగారంలో సామూహిక మరుగు దొడ్లు



చెరుకూరులో నిరుపయోగంగా ఉన్న మరుగు దొడ్లు

- అలంకారప్రాయంగా మరుగుదొడ్లు
- నీరుగారుతున్న స్వచ్ఛ భారత్ లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

వాజేడు : బహిరంగా మలమూత్ర విసర్జన నిషేధానికి స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా నిర్మించిన సామూహిక మరుగు దొడ్లు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లను వినియోగించుకునేందుకు కావాల్సిన కనీస సౌకర్యాలు లేకపోవడంతో తాళాలకే పరిమితమవుతున్నాయి. సొంత మరుగుదొడ్లు లేని వారు, ఇతర గ్రామాల నుంచి వివిధ పనులపై వచ్చే వారు ఉపయోగించుకునేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వీటిని నిర్మించారు. అయితే నిర్మించిన నాటి నుంచి నేటి వరకు వాటి తాళాలు తీయకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. వాజేడు మండల పరిధిలో నాగారం, చెరుకూరు, పేరూరు, కొంగాల, చీకుపల్లి గ్రామ పంచాయతీల్లో ప్రజల సౌకర్యం కోసం మరుగుదొడ్లు నిర్మించారు. బొగత జలపాతం సమీప చీకుపల్లిలో, కొంగాల గ్రామ పంచాయతీ జగన్నాథపురం జంక్షన్ వద్ద ఒక్కొక్కటి రెండేసి గదులతో మరుగుదొడ్లు నిర్మించారు. వీటిలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇవి ఉపయోగంలోకి రావడం లేదు. ఒక్కో స్వచ్ఛ భారత్ మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.1.90 లక్షలు ఖర్చు చేశారు.

నిరుపయోగంగానే..

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా నిర్మించిన మరుగుదొడ్లలో వినియోగానికి ఎల్లప్పుడు నీటిని అందుబాటులో ఉంచాలి. కానీ నీరులేక మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. ఎవరు కూడా బహిర్భూమికి వెళ్లకుండా వీటిని ఉపయోగించుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టిన నేటి వరకు వినియోగంలో లేవు. ప్రధానంగా మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండటం, నీటి సరఫరా లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి స్వచ్ఛ భారత్ మిషన్ మరుగు దొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

కొన్ని వినియోగంలో ఉన్నాయి



మండల పరిధిలోని ఐదు గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్లను నిర్మించాం. ఇందులో బొగత జలపాతం వద్ద పర్యాటకులు వచ్చిన రోజుల్లో నిర్వహణ కొనసాగుతుంది. జగన్నాథపురం, చెరుకూరులో వినియోగంలో ఉన్నాయి. మిగతా వాటిని త్వరలోనే వినియోగంలోకి తీసుకు వస్తాం.

- శ్రీకాంత్ నాయుడు, ఎంపీఓ

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ములుగు : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన అనంతరం ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంమాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కోతి కార్తీక్‌మాదిగ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో నిరసన దీక్షలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు గండ్రకోట సుధీర్‌యాదవ్ మద్దతు తెలిపి పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో మరాఠి రవీందర్, రొంటాల భిక్షపతిమాదిగ, దూడపాక రాజు, బొచ్చు అరవింద్, పెండల సుందరం, కలవాల శ్రీను, వంశీ, కుమార్, సంజీవ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి నిర్మాణ పనుల నిలిపివేత

- భూకబ్జా కథనంపై చర్చ

మంగపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం భూముల కబ్జా, అక్రమ నిర్మాణాలపై 'ప్రభుత్వ భూముల కబ్జా' అనే కథనంతో సోమవారం సాక్షి వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. దీంతో ఏటూరునాగారం–బార్గంపాడు రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో రిటైర్డ్ ఉద్యోగి ఇంటి నిర్మాణానికి చేపట్టిన బోరుబావి పనులను రెవెన్యూ అధికారులు తాత్కాలికంగా నిలిపి వేశారు. దీంతో ఇప్పటికే ప్రభుత్వ స్థలాలు, చెరువుల శిఖం భూములను కబ్జాచేసి, నిర్మాణాలు చేపట్టిన వారికి ఎప్పుడు ఏం జరుగుతుందోననే గుబులు మొదలైంది. అధికారుల అండతో కబ్జాకు పాల్పడిన వారు సమస్య నుంచి బయటపడేందుకు ఆయా అధికారులతో ఫోన్‌లో మంతనాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఏజెన్సీ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి పనులు, బోరుబావి నిర్మాణం పనులకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ ఎలా ఇచ్చారని పలువురు ఆదివాసీ నాయకుల్లో చర్చకు వచ్చినట్లు తెలిసింది. రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహించినంత మాత్రాన ఏ నిబంధనల మేరకు ఇంటి స్థలాలు ఇచ్చారనే విషయంపై చర్చించుకుంటున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూముల కబ్జాపై ప్రత్యేక అధికారితో విచారణ చేసి ఆయా భూములను స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

నిధులు మంజూరు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈశ్వర్

వెంకటాపురం(కె) : మండలంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ దివాకరకు నేతకాని సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జాడి ఈశ్వర్ వినతి పత్రం అందజేశారు. అలాగే కమ్యూనిటీ హాల్, సెంట్రల్ లైట్ రోడ్డు ఏర్పాటు చేయాలని, రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

కేసు నమోదు

వరంగల్ : భూపాలపల్లి జిల్లాలోని నాగారం గ్రామానికి చెందిన అంబాల పున్నంచందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ ఒక ప్రకటనలో తెలిపారు. నాగారం గ్రామం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా టాటా మ్యాజిక్ వాహనంలో గేదెను విక్రయానికి పున్నంచందర్ సోమవారం తీసుకు వచ్చాడు. ఈ క్రమంలో అతడిపై కేసు నమోదు చేసి ఆ గేదెను హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలోని నరసింహస్వామి గోశాలకు తరలించినట్లు వివరించారు.

సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే అని దళిత ఉద్యమ కారులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సావిత్రి బాయి ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాసం రమేష్, కోగిల ఆనంద్, వాసంపెల్లి సత్యం, మల్లికార్జున రావు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి ఫిక్స్‌డ్ బాండ్‌ను అందజేస్తున్న గ్రామస్తులు

మంగపేట : మండలంలోని బుచ్చంపేట గ్రామానికి చెందిన గద్దం సంతోష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన యువకులు దాతల నుంచి సేకరించిన రూ.22,000 నగదును సోమవారం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన సంతోష్ మృతి చెందడంతో ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు యువకులు వాట్సాప్ గ్రూపులో కోరడంతో స్పందించిన దాతలు నగదును అందజేశారు. యువకులు, దాతలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదును మృతుడి కుమార్తె పేరుపై పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను అందజేసి మానవీయతను చాటుకున్నారు. మద్దెల లక్ష్మయ్య, ఉగ్గుమళ్ల గణేష్, మండల రమేష్, పిట్టల సతీష్, బొడ్డు వీరన్న, పన్నాల నాగరాజు, పరుశరామ్, పల్లె విక్రమ్, పొన్నబోయిన నాగేష్, పిట్టల బాలకృష్ణ, ఈసంపెల్లి సురేందర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న 'అమ్మఒడి' వాహనం



గాయపడిన బాలింత



గాయపడిన లక్ష్మి

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని కామారం సమీపంలో అమ్మఒడి వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వాహనంలో ఉన్న వృద్ధురాలు లక్ష్మి తీవ్రంగా గాయపడింది. మంగపేట మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన గర్భిణీ ములుగు సివిల్ ఆస్పత్రిలో ప్రసూతి అనంతరం డిశ్చార్జ్ అయ్యింది. అమ్మ ఒడి వాహనంలో సొంత గ్రామానికి తీసుకెళ్తుండగా తాడ్వాయి దాటిన తర్వాత వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది.ఈ ఘటనలో లక్ష్మి తీవ్రంగా గాయపడగా, స్వల్ప గాయాలతో బాలింత బయటపడ్డారు. క్షతగాత్రులను తాడ్వాయి పీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారి ఆడెపు చిరంజీవి చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం లక్ష్మిని వరంగల్‌కు తరలించారు.

'పంటలకు సాగునీరు అందించాలి'



రైతులతో మాట్లాడుతున్న గోవింద్‌నాయక్

ములుగు రూరల్ : ములుగు మండలంలోని సర్వాపూర్, రాయినిగూడెం, కొత్తూరు, పంచోత్కులపల్లి గ్రామాలకు చెందిన పొలాలకు ఎస్సారెస్పీ కాల్వ ద్వారా సాగునీరు అందించాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎస్సారెస్పీ కాల్వను పరిశీలించిన ఆయన సాగునీరు అందక వందలాది ఎకరాల పంట ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోకుండా మంత్రి సీతక్క స్పందించి సాగునీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ ఆవుల లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ మాలోత్ ర వీందర్, అప్పాజి ఐలయ్య, భిక్షపతి, బత్తుల సాగర్, జాడి శ్రీనివాస్, మధుకర్, నవీన్, సంతోష్, సాయి, రైతులు ఉన్నారు.

తాగునీరు ఇవ్వకుంటే ఐటీడీఏను ముట్టడిస్తాం

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల డిమాండ్
- ఏఓ రాజ్‌కుమార్‌కు వినతి

ఏటూరునాగారం : వాజేడు మండల కేంద్రంలోని గుడిసెవాసులకు తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించకపోతే ఐటీడీఏను ముట్టడిస్తామని తెలంగాణ ఆదివాసీ, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జెజ్జరీ దామోదర్, బొగ్గుల రామలక్ష్మి అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఏఓ రాజ్‌కుమార్ పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏడాదిన్నర నుంచి వాజేడు మండల కేంద్రం మండపాక సమీప ప్రభుత్వ భూమిలో, మండలానికి చెందిన వివిధ గ్రామాల నుంచి గోదావరి వరద ముంపు ప్రాంతాల బాధితులైన ఆదివాసీలు ఇతర పేద, నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని వివరించారు. వారికి తాగేందుకు నీరు లేక చెలిమ నీరే దిక్కైందని తెలిపారు. విద్యుత్ సౌకర్యం లేక చిమ్మచీకట్లో, విష పురుగులతో సహవాసం చేస్తూ జీవిస్తున్నామని వెల్లడించారు. గుడిసెవాసులకు కనీస అవసరాలు, తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే గుడిసె వాసులందరినీ ఏకం చేసి పాదయాత్ర ద్వారా ఐటీడీఏను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ గ్రామసంఘం మండల నాయకులు నాగమణి, శారద, సోనియా పాల్గొన్నారు.

'పెసా' తీర్మానం ప్రకారం వీడీసీ ఇవ్వాలి



ఎంపీడీఓ భద్రునాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

మంగపేట : మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు పెసా గ్రామసభ తీర్మానం మేరకు స్థానిక ఆదివాసీలకే వీడీసీలు ఇవ్వాలని ఎంపీడీఓ భద్రునాయక్‌కు ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ నాయకులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..షెడ్యూల్డ్ ఏరియాలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నా పెసా చట్టం నిబంధనల ప్రకారంగా 1996 జీఓ ఎంఎస్ నంబర్ 66, జీఓ నంబర్ 109 ద్వారా స్థానిక ఆదివాసీలకు ఇవ్వాలని గిరిజనేతరులకు ఎలాంటి వీడీసీలు ఇవ్వరాదని పేర్కొన్నారు.ఆయా గ్రామ పంచాయతీల్లో ఆదివాసీ చట్టాలను కచ్చితంగా అమలు చేసి అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థానిక ఆదివాసీలకు వీడీసీలు ఇచ్చి జీవనోపాధి కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ, ప్రజా సంఘాల జేఏసీ మండల అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు, తోలెం నర్సింహారావు, అన్నెబోయిన సమ్మయ్య, అల్లెం నర్సింహారావు, కొమరం రవి, తోలెం సుధాకర్, జబ్బ నరేష్, పూనెం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

చిట్యాల: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం పీఆర్టీయూ–టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో జ్యోతిరెడ్డి ఫౌండేషన్ సౌజన్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఆర్టీయూ–టీఎస్ జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పీఆర్‌టీయూ మహిళా ఉపాధ్యాయుల పక్షాన ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కోడెపాక రఘుపతి, ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాస్, సూదం సాంబమూర్తి, ఉపాధ్యాయులు నీలిమారెడ్డి, సుమలత, సునీత, పల్లవి, ఊర్మిళ ఉన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



వాజేడు: రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది



వెంకటాపురం(కె) : పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

వెంకటాపురం (కె) : పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి స్నేహరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిరుతపల్లి, చొక్కాల, మరికాల, నూగూరు, ఎదిర, ఆలుబాక గ్రామాల్లో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చొక్కాల పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు సత్యనారాయణ, యాకలక్ష్మి, రామలక్ష్మి ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

మంగపేట : మండలంలోని చుంచుపల్లి ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థినులు, ఉపాధ్యాయులకు వైద్యపరీక్షలు చేశారు. వారి నుంచి రక్త నమూనాలు సేకరించి మందులు అందజేశారు.



మంగపేట: విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి యమున

కార్యక్రమంలో పీహెచ్ఎస్ శైలజ, హెల్త్ అసిస్టెంట్ కోరెం శ్రీనివాస్, ఏఎన్ఎం భాగ్య పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ

వాజేడు : గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో పనిచేస్తున్న సిబ్బంది రక్త నమూనాలను పేరూరు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది సోమవారం సేకరించారు. మండల పరిధిలోని పేరూరు, పెద్దగొళ్లగూడెం ఆశ్రమ వసతి గృహాల్లో పని చేస్తున్న సిబ్బంది రక్త నమూనాలను సేకరించాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతి కుమార్ ఆదేశాల మేరకు రక్త నమూనాలను తీసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ వేణుగోపాల్ కృష్ణ, నవీన్, తిరుపతి, శ్రీనివాస్, రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

'ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న ఏడీఈ సుధాకర్

ఏటూరునాగారం : కొంతమంది కావాలని తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఏ టూరునాగారం విద్యుత్‌శాఖ ఏడీఈ సుధాకర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమాలకు పాల్పడినట్లు ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ నిబంధనల ప్రకారం లోబడి పనిచేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఆంధ్ర, తెలంగాణ అని వేరు చేసి మాట్లాడడం సమంజసం కాదని హితవు పలికారు. తప్పుడు ఆరోపణలు చేసే వారిపై చట్టప్రకారం కేసు పెడుతానని ఆయన వెల్లడించారు. అవినీతి, అక్రమాలు చేస్తున్నట్లు ఆరోపణలు చేయడం ఏంటని ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాలో ఏదైనా సమస్య ఉన్నా, దానిని పట్టించుకోకున్నా, నిబంధనలను అతిక్రమిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.